క్లుప్తంగా

నేడు ఆలయ రజతోత్సవం

కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్ పట్టణంలోని త్రిశూల్‌పహాడ్‌పై గల శ్రీ లక్ష్మి సత్యనారాయణ స్వామి దేవాలయంలో శుక్రవారం రజతోత్సవ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు మహవీర్ ప్రసాద్ తెలిపారు. దేవాలయం స్థాపించి 25 వసంతాలు కావడంతో కార్యక్రమం చేపడుతున్నట్లు పేర్కొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు.

సఖీ సేవలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న సఖీ కేంద్రం సభ్యులు

దహెగాం: మహిళలకు భరోసానిచ్చే సఖీ సేవలపై సభ్యులు గురువారం మండలంలోని కుంచవెల్లి, పీపీరావు కాలనీ, కల్వాడ, హత్తిని తదితర గ్రామాల్లో అవగాహన కల్పించారు. సఖీ సభ్యురాలు మౌనిక మాట్లాడుతూ బాల్య వివాహాలు చేయడం వల్ల వచ్చే అనర్థాలను వివరించారు. మహిళలు హెల్ప్‌లైన్ కోసం 8500240181, 8500785181 నంబర్లలో సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో మమత తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన కబడ్డీ పోటీలు



బహుమతులు అందజేస్తున్న ఎంపీపీ

కెరమెరి: మండలంలోని సాంగ్వి గ్రామంలో మూడు రోజుల క్రితం ప్రారంభమైన కబడ్డీ పోటీలు గురువారం ముగిశాయి. పోటీల్లో మొత్తం 30 జట్లు పాల్గొనగా విజేతగా అంబరావుగూడ జట్టు, రన్నరప్‌గా నిషాని జట్టు నిలిచాయి. మూడో బహుమతిని గౌరి గ్రామానికి చెందిన జట్టు కైవసం చేసుకుంది. విజేతలకు ప్రథమ బహుమతి రూ.7777, రెండో బహుమతి రూ.5555, మూడో బహుమతి రూ.3333లను ఎంపీపీ పెందోర్ మోతిరాం, సర్పంచ్ తొడసం జగన్నాథ్‌రావు, ఎంపీటీసీ సకారాం, విద్యార్థి సంఘం నాయకుడు మడావి భూషణ్ అందజేశారు.

బీజేపీ కార్యవర్గ సభ్యుడిగా శ్రావణ్ గౌడ్

కాగజ్‌నగర్‌టౌన్: భారతీయ జనతా పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడిగా బొమ్మన శ్రావణ్ గౌడ్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీనివాస్ గురువారం ఆయనకు నియామక పత్రం అందజేశారు.

నేడు పాదుక దర్శనం

సిర్పూర్(టి): మండల కేంద్రంలోని కొత్తకాలనీ సమీపంలో శుక్రవారం స్వామి నరేంద్ర చార్యజీ మహరాజ్ పాదుక దర్శనం, ఉపాసక్ దీక్ష కార్యక్రమం నిర్వహించనున్నట్లు పాదుక దర్శనం కార్యక్రమ నిర్వాహకులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు పాదుక దర్శనం కార్యక్రమం నిర్వహించిన అనంతరం ఉపాసక్ దీక్ష కార్యక్రమం ఉంటుందని, భక్తులు సకాలంలో హాజరై కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు.

కొనసాగుతున్న మధ్యాహ్న భోజన పథకం



భోజనం వడ్డిస్తున్న నాయకులు

సిర్పూర్(టి): మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు కోనేరు ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మధ్యాహ్న భోజన పథకం కొనసాగుతోంది. గురువారం కోనేరు ట్రస్టు ఆధ్వర్యంలో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించారు. కళాశాలలో విద్యార్థుల సౌకర్యార్థం వసతులు ఏర్పాటు చేస్తామని మండల నాయకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఇఫాత్‌హుస్సేన్, తోట మహేష్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

'కంటి వెలుగు' ప్రారంభం



వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యసిబ్బంది

సిర్పూర్(టి): మండలంలోని చీలపెల్లి గ్రామంలో గురువారం సర్పంచ్ బ్రహ్మయ్య యాదవ్ ఆధ్వర్యంలో కంటి వెలుగు వైద్య శిబిరాన్ని వైద్యాధికారులు ప్రారంభించారు. ఈ సందర్భంగా వైద్యశిబిరంలో కంటి పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ప్రతీ ఒక్కరు కంటివైద్య శిబిరం సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది నర్సయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.

తుంపర సేద్యం.. పంటకు భాగ్యం

- తక్కువ నీటితో ఎక్కువ సాగు
- నీటి వృథాకు కళ్లెం



ధనోరాలో స్ప్రింక్లర్లతో నేలను తడుపుతున్న దృశ్యం

కెరమెరి: తక్కువ నీటి వినియోగంతో ఎక్కువ పంటలు సాగు చేస్తూ మండల రైతులు ఆదర్శంగా నిలుస్తున్నారు. ప్రధానంగా తుంపర సేద్యంతో నీరు వృథా కాకుండా రైతులు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. మూడు పంటలు పండించే రైతులకు తుంపర సేద్యం ఎంతగానో ఉపయోగపడుతుంది. మండలంలో 106 గ్రామాలు ఉండగా సుమారు 50 వరకు గ్రామాలకు నదులు, చెరువులు, కుంటలు వంటి నీటి సౌకర్యం లేదు. దీంతో ఆయా గ్రామాల రైతులు పంటలు సాగు చేయడం ఇబ్బందిగా మారింది. మిషన్ కాకతీయ ద్వారా చెరువుల్లోని నీటిని పొలాలకు వినియోగించుకోవచ్చని గతంలో ప్రభుత్వం ఏర్పాట్లు చేసినా ప్రయోజనం లేకుండా పోయింది. చెరువులు, కుంటల్లో నీరు లేకపోవడంతో రైతులు పంటలు సాగు చేసేందుకు తుంపర సేద్యం అనివార్యమైంది. ఈ విధానంతో కొద్ది పాటి నీటితో రైతులు పంటలను సాగు చేస్తున్నారు. రైతులు ఎక్కువ ఆరుతడి పంటలు సాగు చేస్తూ లాభాలు గడిస్తున్నారు. మండలంలోని మొత్తం 31 గ్రామ పంచాయతీల్లో 6634 మంది రైతులు ఉన్నారు. 25 వేల ఎకరాల్లో పంటలు పండిస్తుండగా, 360 మంది రైతుల పొలాల్లో విద్యుత్ మీటర్లు ఉన్నాయి. కాగా 1579 ఎకరాల్లో రైతులు ఆరుతడి పంటలు పండిస్తున్నారు. మండలంలోని గోయాగాం, ధనోరా, రింగన్‌ఘట్, సుర్దాపూర్, మోడి, ఝరి, సాంగ్వి, కెలికే, కెలిబి, సాకడ, సావర్‌కెడా, ఇందాపూర్, అనార్‌పల్లి, దేవాపూర్, లక్మాపూర్, కరంజివాడ, కెరమెరి, సుల్తాన్‌గూడ తదితర గ్రామాల్లోని రైతులు అధికంగా తుంపరి సేద్యంతోనే పంటలు పండిస్తూ నీరు వృథా చేయకుండా ఆదర్శంగా నిలుస్తున్నారు.

నీటి వృథా ఉండదు



నేను ప్రస్తుతం టమాటా, వేరుశనగ, పల్లి, జొన్న పంటలు సాగు చేస్తున్నాను. ప్రతీరోజు రెండు సార్లు స్ప్రింక్లర్ల ద్వారా ఆయా పంటలకు నీరందిస్తున్నాను. రైతులు తమ పొలాల్లో మోటార్లు వేసి కూరగాయాలు పండిస్తే లాభసాటిగా ఉంటుంది. తుంపర సేద్యంలో నీటి వృథా ఉండదు.

\- షేక్ హుస్సేన్, రైతు, కెరమెరి

తక్కువ నీరు.. ఎక్కువ సాగు



తుంపర సేద్యం వల్ల తక్కువ నీటితో ఎక్కువ సాగు చేసుకునే అవకాశం ఉంది. దీనికి ఖర్చు కూడా తక్కువే. రైతులు తమ పొలాల్లో బోర్లు బిగించి ఈ విధానంలో పంటలు సాగు చేయాలి. ఇతర రైతులు కూడా తుంపర సేద్యం వైపు మళ్లితే నీటి కొరత ఉండదు.

\- గోపికాంత్, మండల వ్యవసాయాధికారి

కేజీబీవీ యూఆర్‌ఎస్ వర్కర్ల వేతనాలు పెంచాలి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఆసిఫాబాద్‌రూరల్: కేజీబీవీ యూఆర్‌ఎస్ నాన్ టీచింగ్ వర్కర్ల వేతనాలు పెంచాలని కోరుతూ గురువారం పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే ఆత్రం సక్కుకు వినతిపత్రం అందజేశారు. సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి తిరుపతి మాట్లాడుతూ కేజీబీవీలలో పని చేస్తున్న నాన్ టీచింగ్ వర్కర్లకు కనీస వేతనాలు కూడా అమలు చేయకుండా రాష్ట్ర ప్రభుత్వం శ్రమ దోపిడి, వెట్టిచాకిరి చేయిస్తుందన్నారు. నేటి నుంచి జరిగే అసెంబ్లీ బడ్జెట్ సమావేశంలో సమస్యలను సభ దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో నాన్ టీచింగ్ వర్కర్ల అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు భవాని, నాయకులు సౌజన్య, శోభ తదితరులు ఉన్నారు.

హై ఓల్టేజీ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలి



దరఖాస్తు సమర్పిస్తున్న రైతులు

కెరమెరి: ప్రస్తుతం ఉన్న 25 కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ స్థానంలో కొత్తగా 65 కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలని గురువారం సుల్తాన్‌గూడ, చందుగూడకు చెందిన రైతులు విద్యుత్ సిబ్బందిని కోరారు. ఈమేరకు ఆ శాఖ ఎల్ఐ రాజశేఖర్‌కు దరఖాస్తు సమర్పించారు. రైతులు మాట్లాడుతూ 25 కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌తో ఇబ్బందులు పడుతున్నామని, లోడ్ ఎక్కువ కావడంతో తరుచూ మరమ్మతులకు గురవుతుందని పేర్కొన్నారు. సమస్య పరిష్కారానికి హై ఓల్టేజీ ట్రాన్స్‌ఫార్మర్ బిగించాలని, దానికి సంబంధించిన ఖర్చులను భరిస్తామని తెలిపారు. రైతులు సుభాష్, ఛోటు, బాలాజీ, తదితరులు ఉన్నారు.

మెగా వైద్య శిబిరాన్ని విజయవంతం చేయండి



మాట్లాడుతున్న యాదవ్‌రావు, పక్కన అరుణ

నార్నూర్(జైనూర్): ఈ నెల 6న జైనూర్ మండల కేంద్రంలో నిర్వహించనున్న మెగా వైద్య శిబిరాన్ని విజయవంతం చేయాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కనక యాదవ్‌రావు, కోవ లక్ష్మి ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షురాలు, సిర్పూర్ యూ జెడ్పీటీసీ కోవ అరుణ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని మార్కెట్ యార్డు వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి జన్మదినం సందర్భంగా మండల కేంద్రంలో మెగా వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో హజ్ కమిటీ సభ్యుడు ఇంతియాజ్‌లాల, వైస్ ఎంపీపీ చిర్లే లక్ష్మణ్, సర్పంచ్‌లు పార్వతిలక్ష్మణ్, శ్యామ్‌రావు, నాయకుడు అంబాజీ, పేతురు లచ్చు తదితరులు ఉన్నారు.

రిటైర్డ్ డైరెక్టర్‌కు సన్మానం

శ్రీరాంపూర్: గత నెల రిటైర్డ్ అయిన సింగరేణి డైరెక్టర్(ఆపరేషన్స్) ఎస్ చంద్రశేఖర్‌ను గుర్తింపు సంఘం టీబీజీకేఎస్ నేతలు ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. కొత్తగూడెంలో గురువారం జరిగిన కార్యక్రమంలో టీబీజీకేఎస్ అధ్యక్షుడు బీ వెంకట్రావు ఆధ్వర్యంలో చంద్రశేఖర్‌కు సన్మానం చేశారు. దీనికి శ్రీరాంపూర్ డివిజన్ నుంచి నస్పూర్ మున్సిపల్ చైర్మన్ ఈసంపల్లి ప్రభాకర్, ఆ యూనియన్ ఉపాధ్యక్షులు డీ అన్నయ్య, మంద మల్లారెడ్డి, డిప్యూటీ ప్రధాన కార్యదర్శి చాట్ల అశోక్, కేంద్ర చర్చల ప్రతినిధి ఏనుగు రవీందర్‌రెడ్డి హాజరై వారిని ఘనంగా సన్మానించారు.
ఆయన కంపెనీలో చేసిన సేవలను కొనియాడారు. అనంతరం నూతనంగా బాధ్యతలు చేపట్టిన డైరెక్టర్ (పీపీ) జీ వెంకటేశ్వర్‌రెడ్డి, మరో డైరెక్టర్(ఆపరేషన్స్) ఎన్‌వీకే శ్రీనివాస్‌లను కూడా సత్కరించారు. కార్యక్రమంలో పలువురు యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

కరాటే శిక్షణతో ఆత్మరక్షణ

బెల్లంపల్లిరూరల్(బెల్లంపల్లి): బాలికల ఆత్మరక్షణకు కరాటే శిక్షణ ఎంతగానో దోహదపడుతుందని బెల్లంపల్లి కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ) ప్రత్యేకాధికారిణి సి.వాణి అన్నారు. కేజీబీవీలో విద్యార్థినులకు ఉచిత కరాటే శిక్షణ శిబిరాన్ని గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్ల్స్ చైల్డ్ ఎంపవర్‌మెంట్ క్లబ్‌లో భాగంగా జిల్లా పరిధిలోని పాఠశాలల్లో ఆరు నుంచి తొమ్మిదో తరగతి విద్యార్థినులకు నెల రోజుల పాటు ఉచిత కరాటే శిక్షణ ఇచ్చేందుకు ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళిక రూపొందించిందన్నారు. ఆపద సమయంలో విద్యార్థినులు, మహిళలు తమను తాము రక్షించుకోవడానికి, శారీరక, మానసిక ధృడత్వానికి కరాటే శిక్షణ ఎంతగానో ఉపయోగపడుతుందని సూచించారు. కరాటేలో నైపుణ్యం కలిగిన వారితో శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ప్రతి విద్యార్థినీ చదువుతో పాటు కరాటే శిక్షణను సక్రమంగా అభ్యసించి ఆపదకాలంలో ఆత్మరక్షణ పొందాలని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.

రూ.2లక్షల ఎల్‌వోసీ మంజూరు

కోటపల్లి: సుపాక గ్రామానికి చెందిన గనుముకుల రాజన్న అనే వ్యక్తి కొద్ది రోజులుగా హైదరాబాద్ నిమ్స్‌లో చికిత్స పొందుతున్నాడు. రాజన్న ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న విషయాన్ని స్థానిక ఎంపీటీసీ తిరుపతి, వైస్ ఎంపీపీ వాలశ్రీనివాసరావు ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే బాల్కసుమన్ దృష్టికి తీసుకెళ్లగా స్పందించి సీఎం సహాయనిధి నుంచి రూ.2లక్షల ఎల్‌వోసీ మంజూరు చేయించారు. ఎల్‌వోసీ మంజూరు చేసిన ప్రభుత్వ విప్ బాల్కసుమన్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

'ఆయుష్మాన్ భారత్‌ను సద్వినియోగం చేసుకోవాలి'

శ్రీరాంపూర్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆయుష్మాన్ భారత్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెరబెల్లి రఘునాథ్‌రావు తెలిపారు. నస్పూర్ మున్సిపాలిటీలోని నాలుగో వార్డులో గురువారం ఆయన అవగాహన కల్పించి 20మంది లబ్ధిదారులకు నమోదు చేసిన పత్రాలను అందించారు. ఇది ఎంతో చక్కని పథకం అని, కార్యకర్తలంతా దీన్ని ప్రజల్లోకి తీసుకెళ్లి సద్వినియోగం చేసుకునేలా చూడాలన్నారు.

ఉపాధి కల్పించాలని దివ్యాంగుల వినతి



వినతిపత్రం అందజేస్తున్న దివ్యాంగులు

కాగజ్‌నగర్‌టౌన్: ఉపాధి కల్పించాలని కోరుతూ అదనపు కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్‌కి పలువురు దివ్యాంగులు గురువారం వినతిపత్రం అందజేశారు. చైతన్య దివ్యాంగుల సంఘం అధ్యక్షుడు మొహమ్మద్ ఖయ్యూం ఆధ్వర్యంలో దివ్యాంగులు మున్సిపల్ కార్యాలయానికి వచ్చిన అదనపు కలెక్టర్‌ను కలిశారు. పే˝ఎర్ ప్లేట్స్, గ్లాసుల తయారీ మిషన్లను ఇప్పించి ఆదుకోవాలని వేడుకున్నారు. అలాగే దివ్యాంగుల భవనం కేటాయించాలని కోరారు.

ఆశల సమస్యలు పరిష్కరించాలి

తిర్యాణి: వైద్యశాఖలో పని చేస్తున్న ఆశా కార్యకర్తల సమస్యలు పరిష్కరించాలని బీజేపీ అసెంబ్లీ కో కన్వీనర్ సౌర రమేశ్ గౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తమ సమస్యల పరిష్కారం కోసం ఆశలు గురువారం మండల కేంద్రంలోని సీహెచ్‌సీలో చేపట్టిన ధర్నాకు ఆయన మద్దతు తెలిపారు. పార్టీ మండల అధ్యక్షుడు పులి వెంకటేష్, తుడుందెబ్బ డివిజన్ అధ్యక్షుడు వెడ్మ భగవంత్‌రావు ఉన్నారు.


నేడు కల్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ

కౌటాల: మండల కేంద్రంలోని రైతువేదిక భవనంలో శుక్రవారం లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు పంపిణీ చేయనున్నట్లు తహసీల్దార్ మునావర్ షరీఫ్ గురువారం తెలిపారు. నేడు ఉదయం 9 గంటలకు చెక్కుల పంపిణీ కార్యక్రమం ఉంటుందన్నారు. 56 మంది లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేస్తామని, హాజరు కావాలని కోరారు.

దివ్యాంగుడికి మాజీ సైనికుల చేయూత

కాగజ్‌నగర్‌టౌన్: పట్టణంలోని సర్‌సిల్క్ కాలనీకి చెందిన దివ్యాంగుడు శ్రీనివాస్ కొంత కాలంగా తన ట్రైసైకిల్ చెడిపోయి బయటకు వెళ్లలేక ఇబ్బందులు పడుతున్నాడు. విషయం తెలుసుకున్న మాజీ సైనికుడు శివ, తన మిత్రుడు నీరజ్ సింగ్‌తో కలిసి గురువారం నూతనంగా రెండు బ్యాటరీలు కొనుగోలు చేసి శ్రీనివాస్‌కు అందజేశారు.

ఎమ్మెల్యేను సన్మానించిన వీవీలు



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న విద్యా వలంటీరీలు

దహెగాం: మండలంలోని విద్యా వలంటరీలు గురువారం ఎమ్మెల్యే నివాసంలో ఎమ్మెల్యే కోనేరు కోనప్పను కలిసి ఘనంగా సన్మానించారు. రెండేళ్లుగా వేతనాలు అందక తాము పడుతున్న ఇబ్బందులను అర్థం చేసుకుని ఉన్నతాధికారులతో మాట్లాడి పెండింగ్ వేతనాలు అందేలా కృషి చేసినందుకు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వీవీలు కంబాల నరేందర్, రవి, రాజు, సంజీవ్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

'అన్నదాతల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం'



భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే కోనప్ప

బెజ్జూర్: అన్నదాతల అభివృద్ధే ధ్యేయంగా ప్రభుత్వం ముందుకు సాగుతుందని సిర్పూర్ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప అన్నారు. మండలంలోని గొల్లబాయి చెరువు మత్తడి వింగ్‌వాల్ మరమ్మతు పనులకు గురువారం భూమిపూజ చేశారు. గతంలో చెరువు మత్తడి వింగ్‌వాల్ కూలి సాగునీరు వృథా అవుతుందని ఆయకట్టు రైతులు, మత్స్యకారులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత వర్షాకాలంలోనే చెరువుకు తాత్కాలిక పనులు చేపట్టామన్నారు. ప్రస్తుతం ఇరిగేషన్ శాఖ ఆధ్వర్యంలో రూ.22.26 లక్షల నిధులు మంజూరు కాగా పనులకు భూమిపూజ చేశామని పేర్కొన్నారు. అనంతరం ఎమ్మెల్యేను మత్స్యకారులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ పంద్రం పుష్పలత, చింతలమానెపల్లి ఎంపీపీ డుబ్బుల నానయ్య, రైతుబంధు సమితి జిల్లా అధ్యక్షుడు కొంగ్ర జగ్గాగౌడ్, సహకార సంఘం చైర్మన్ ఓంప్రకాష్, కోఆప్షన్ సభ్యుడు బషారత్ ఖాన్, మాలి సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు రామకృష్ణ, యూత్ మండల అధ్యక్షుడు నరేందర్ గౌడ్, నాయకులు పుల్లూరి సతీష్ కుమార్, దేవాజీ, మహేష్, భీంరావు, నికాడి బాబురావు, శంకర్, గ్రామపంచాయతీల సర్పంచులు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన రవాణా సౌకర్యం..

కౌటాల: గ్రామీణ ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం కల్పిస్తామని ఎమ్మెల్యే కోనేరు కోనప్ప అన్నారు. గురువారం తలోడి చౌరస్తా నుంచి ధనూర్ హెట్టి వరకు బీటీరోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రవాణా సౌకర్యం కల్పించడానికి నిధులు కేటాయిస్తుందన్నారు. రోడ్డు నిర్మాణానికి ఆర్‌డబ్ల్యూఈ రూ.కోటి నిధులు మంజూరైనట్లు తెలిపారు. ఆయన వెంట కోఆప్షన్ సభ్యులు అజ్మత్ అలీ, ఉప సర్పంచ్ తిరుపతి, నాయకులు వెంకన్న, శ్రీనివాస్, రవీందర్ గౌడ్, ఆగయ్య, గట్టయ్య, పోశం, హన్మంతు, శైలేష్, తదితరులు పాల్గొన్నారు.

భక్తులు ఇబ్బంది పడకుండా ఏర్పాట్లు చేయాలి



షెడ్డు నిర్మాణ పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సక్కు

రెబ్బెన: గంగాపూర్ జాతరకు వచ్చే భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని ఎమ్మెల్యే ఆత్రం సక్కు అన్నారు. జాతర ఏర్పాట్లను ఆయన గురువారం పరిశీలించారు. ముందుగా స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయం వద్ద నూతనంగా నిర్మిస్తున్న షెడ్డు నిర్మాణ పనులు పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ మూడు రోజుల పాటు సాగే జాతరకు వేల సంఖ్యలో భక్తులు తరలివస్తారని రద్దీకి అనుగుణంగా ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. జెడ్పీటీసీ సంతోష్, ఎంపీపీ సౌందర్య, పీఏసీఎస్ చైర్మన్ సంజీవ్ కుమార్, వైస్ చైర్మన్ మహేష్‌గౌడ్, ఆలయ కమిటీ చైర్మన్ వెంకటేశం చారి, సర్పంచ్ వినోద, నంబాల సర్పంచ్ సోమశేఖర్, ఎంపీటీసీ మధునయ్య, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, నాయకులు సుదర్శన్‌గౌడ్, రాజేశ్వర్‌రావు, గంగన్న, మురళీగౌడ్, విమలేష్, పంచాయతీ కార్యదర్శి మురళీధర్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు సీఎం రిలీఫ్ ఫండ్ వరం



చెక్కు అందజేస్తున్న ఎంపీపీ విశ్వనాథ్

కౌటాల: సీఎం రిలీఫ్ ఫండ్ నిరుపేద ప్రజలకు వరం లాంటిదని ఎంపీపీ బసర్కార్ విశ్వనాథ్ అన్నారు. మండలంలోని శీర్షా, గుడ్లబోరి గ్రామాల్లోని లబ్ధిదారులకు గురువారం కౌటాలలో చెక్కులు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మనీష్, వసంత్‌రావ్, కోఆప్షన్ సభ్యుడు అజ్మత్, ఉప సర్పంచ్ తిరుపతి, బీఆర్‌ఎస్ యూత్ మండల అధ్యక్షుడు రవీందర్ గౌడ్, నాయకులు బాపు, సత్యనారాయణగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

మున్నూరుకాపు సంఘం జిల్లా కార్యవర్గం ఎన్నిక

ఆసిఫాబాద్‌అర్బన్: మున్నూరుకాపు సంఘం నూతన కార్యవర్గాన్ని గురువారం జిల్లా కేంద్రంలో సంఘం జిల్లా అధ్యక్షుడు మిట్ట వెంకన్న అధ్యక్షతన ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా గౌరవ అధ్యక్షుడిగా గజ్జి రామయ్య ఎన్నిక కాగా, ప్రధాన కార్యదర్శిగా సంతోష్, కోశాధికారిగా నారాయణ, ఉపాధ్యక్షులుగా వెంకన్న, శ్రీనివాస్, సహాయ కార్యదర్శులుగా రమేష్, మహేష్, సెక్రటరీగా మేకర్తి శ్రీనివాస్, కిషన్, సలహాదారులుగా రమేష్, రాంచందర్, కార్యవర్గ సభ్యులుగా శేఖర్, కిష్టయ్య, సతీష్, మహేష్, తిరుపతి, శ్రీనివాస్, శంకర్, బనేష్, లచ్చయ్య, రాము, రవీందర్, సత్యనారాయణలను ఎన్నుకున్నారు. సురేష్, సదాశివ్, వెంకటేష్, తిరుపతి, దేవేందర్, జక్కయ్య పాల్గొన్నారు.

8న అడహక్ కమిటీ ఎన్నిక

కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్ పట్టణంలోని బట్టుపల్లి చౌరస్తా వద్ద గల మున్నూరు కాపు సంఘ భవనంలో ఈనెల 8న మధ్యాహ్నం 2 గంటలకు మున్నూరు కాపు సంఘం జిల్లా అడహక్ కమిటీ ఎన్నిక నిర్వహించనున్నట్లు సంఘం నాయకులు గజ్జల లక్షణ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశంలో మున్నూరు కాపు సంఘ అభివృద్ధి, గ్రామ, మండల, పట్టణ, జిల్లా కమిటీల ఏర్పాటుపై చర్చించనున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలోని అన్ని మండలాలు, గ్రామాల నుంచి మున్నూరుకాపులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

బౌద్ధ మహాసభ కమిటీలు ఎన్నిక



ఎన్నికైన నూతన కమిటీ

సిర్పూర్(టి): మండలంలోని గ్రామాల్లో గురువారం భారతీయ బౌద్ధ మహాసభ సంఘం గ్రామ కమిటీలను సంఘం మండల అధ్యక్షుడు నగ్రాడె రాజు ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండలంలోని కొమ్ముగూడ, కోనేరు కాలనీ గ్రామాల్లో కమిటీలను ఎన్నుకున్నారు. కొమ్ముగూడ అధ్యక్షుడిగా దుర్గం విలాస్, ఉపాధ్యక్షులుగా సురేష్, దుర్గం రవీందర్, దుర్గం ప్రకాష్, దుర్గం శంకర్, ప్రధాన కార్యదర్శిగా దుర్గం వికాస్‌రాజ్, సంయుక్త కార్యదర్శులుగా రాంటెంకి శ్రీకాంత్, దుర్గం రవీందర్, జాడి వెంకటేష్, దుర్గం వస్‌పాల్, కోశాధికారిగా దుర్గం స్వాగత్ తదితరులను ఎన్నుకున్నారు. కోనేరు కాలనీ అధ్యక్షుడిగా జనార్దన్, ఉపాధ్యక్షులుగా భీంరావ్, గౌతం, ప్రధాన కార్యదర్శిగా చేతన్ కుమార్, సంయుక్త కార్యదర్శులుగా కార్తీక్, మారుతి, కోశాధికారిగా బెండారి సునీల్‌లను ఎన్నుకున్నారు.

భక్తిశ్రద్ధలతో పూజలు



కౌటాల: మండల కేంద్రంలోని కంకలమ్మ గుట్ట సమీపంలో గురువారం భక్తిశ్రద్ధలతో సమ్మక్క -సారలమ్మ గద్దెల వద్ద స్థానిక భక్తులు పూజలు చేశారు. మహిళలు బోనాలు ఎత్తుకొని సమ్మక్క -సారలమ్మ గద్దెలను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.